భక్తి శ్రద్ధలతో కావడి యాత్ర



యాత్రలో ముద్దాపురం మదన్‌గౌడ్

సుభాష్‌నగర్: ఒడిస్సా ప్రజలు కావడి యాత్రను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుత్బుల్లాపూర్‌లోని వివిధ ప్రాంతాల నుంచి సూరారంలోని ఉమామహేశ్వర ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీరికి ఆలయ కమిటీ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ ఘనంగా స్వాగతం పలికారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

కట్టమైసమ్మ వార్షికోత్సవ వేడుకలు షురూ



పూజలు చేస్తున్న భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని కట్ట మైసమ్మ ఆలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు గురు ప్రార్థన, గణపతి పూజ, పుణ్యహవాచనం, స్థలశుద్ధి భూతోచ్చాటనం, సుదర్శనా దిక్బంధనం, అఖండ దీపస్థాపన, దీక్షాధారణ, ధ్వజారోహణం, నవగ్రహ, వాస్తు, క్షేత్రపాలక అవాహనం, మధ్యాహ్నం 12.30 గంటలకు మంగళహారతి, సాయంత్రం 5 గంటలకు ఆవాహిత దేవతాపూజ, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ఠ, లక్ష్మీపతి పూజ, మహాగణపతి హవనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ ఆవరణలోని కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 9 నుంచి సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించి మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు.

చెత్తకు నిలయంగా పరికి చెరువు..!



పరికి చెరువులో పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త

సుభాష్‌నగర్: ఒకప్పుడు ఆహ్లాదం పంచిన పరికి చెరువు ప్రస్తుతం మురికి కూపంగా మారింది. గాజులరామారం డివిజన్ కైలాస హిల్స్ ఆనుకుని పరికి చెరువు 45.1 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. అయితే కొంతమంది నిర్లక్ష్యంగా చెత్తాచెదారాన్ని పారబోయడంతో ప్లాస్టిక్ వ్యర్థాలతో చెరువు కలహీనంగా దర్శనమిస్తోంది. అంతేగాకుండా దుర్వాసన వస్తోంది సమీప కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకుని చెరువును పరిరక్షించాలని వారు కోరుతున్నారు.

'ఎన్‌ఎస్‌యూఐని రద్దు చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్‌ఎస్‌యూఐని రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎన్‌ఎస్‌యూఐ ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థినులపై జరిగే లైంగిక దాడుల వెనుక ఎన్‌ఎస్‌యూఐ నేతల హస్తం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వృథ్వీతేజ, అలివేలి రాజు, హరిప్రసాద్, కమల్ సురేష్, ఉదయ్, వినయ్, సాయి తేజ, దృహాన్, శివ శంకర్ పాల్గొన్నారు.

గాయపడిన మహిళలకు పరామర్శ

ఆల్విన్‌కాలనీ: బీరంగూడలోని ఓ షాపింగ్ మాల్‌లో పనికి వెళ్లి లిఫ్ట్ ప్రమాదానికి గురైన ఎన్టీఆర్‌నగర్ వాసులు జుబీనా సుల్తానా, హీనా, చంద్రకళ, మోహమ్మద్ జుబేదా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్‌రావు సోమవారం వారి నివాసాలకు వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో సాయిగౌడ్, కల్యాణ్, రాజు, ఫజల్, బాలస్వామి, చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో పరేషాన్..!



గాంధీనగర్ పారిశ్రామికవాడ దీనా ఫుడ్స్ గల్లీలో మ్యాన్‌హోళ్లపై నిలిపిన క్రేన్లు

- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- విరిగిన విద్యుత్ స్తంభాలు, పగులుతున్న మ్యాన్‌హోళ్లు

రంగారెడ్డినగర్: గాంధీనగర్ పారిశ్రామికవాడలో ఓవైపు భారీ వాహనాల అక్రమ పార్కింగ్, మరోవైపు కుంగిన విద్యుత్ స్తంభాలు, అధ్వానంగా ఉన్న మ్యాన్‌హోళ్లతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇతర ప్రాంతాల నుండి లోడింగ్, అన్ లోడింగ్‌కు వచ్చే వాహనాలు రోజుల తరబడి రోడ్లకిరువైపులా రోజుల తరబడి నిలుపుతుండడంతో రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. అదేవిధంగా కొందరు క్రేన్ల నిర్వాహకులు సైతం రోడ్లకిరువైపులా పెద్ద సంఖ్యలో నిలుపుతున్నారు. ఆయా పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను లోడింగ్, అన్ లోడింగ్ ముగిసిన వెంటనే తరలించేలా ఐలా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని సమీప కాలనీలు, బస్తీల ప్రజలు ఆరోపిస్తున్నారు. గాంధీనగర్–సంజయ్‌గాంధీనగర్ రోడ్డు, ఐడీపీఎల్–జగద్గిరిగుట్ట రోడ్డు, గాంధీనగర్ ప్రధాన రోడ్డు మార్గం, సంజయ్‌గాంధీనగర్ నుంచి దినాలి ఫుడ్స్ మీదుగా ప్రధాన రోడ్డు మార్గాల్లో భారీ వాహనాలను నిలుపుతున్నారు. గిరినగర్ నాలా కల్వర్ట్ సమీపంలో రోడ్డుకిరువైపులా నిలపడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

డ్రైనేజీ లైన్లపైనే క్రేన్‌లు..

జగద్గిరిగుట్ట–ఐడీపీఎల్ రోడ్డులోని రంగారెడ్డినగర్ బస్టాప్ నుంచి సంజయ్‌గాంధీనగర్‌కు వెళ్లే మార్గంలో క్రేన్లను దీనాలి ఫుడ్స్ పరిశ్రమ ఎదుట ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లపైనే నిలుపుతుండడంతో అవి ధ్వంసమయ్యాయి. జలమండలి అధికారులు సదరు మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టారు. అయినా క్రేన్లను అలాగే నిలుపుతున్నారని దీంతో మ్యాన్‌హోళ్ల మళ్లీ ధ్వంసమయ్యే ఆస్కారముందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రజా ధనానికి నష్టం..

భారీ వాహనాలు రోడ్ల పక్కన నిలిపే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొడుతున్నాయి. దీంతో అవి వంగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు ధ్వంసమవుతున్నాయి. అవి ఎప్పుడూ కూలుతాయోనని అని ఆటుగా రాకపోకలు సాగించే వారు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని అధికారులు

గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతం అటు జీడిమెట్ల, ఇటు బాలానగర్ ట్రాఫిక్ పీఎస్‌లకు సరిహద్దుగా ఉండడంతో రోడ్లపై నిలుపుతున్న భారీ వాహనాలు, క్రేన్ల విషయంలో చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యారు. ఇరు పీఎస్‌ల అధికారులు అక్రమ పార్కింగ్‌లను కట్టడి చేయకపోవడంతో ఇష్టానుసారంగా భారీ వాహనాలు నిలుపుతూ ఇబ్బందులు సృష్టిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

గాంధీనగర్ పారిశ్రామికవాడలో విద్యుత్ స్తంభాలు ధ్వంసమైన విషయం మా దృష్టికి వచ్చింది. సదరు వాహనదారులను గుర్తించి సంబంధిత పరిశ్రమల నిర్వాహకుల నుంచి జరిగిన నష్టాన్ని వసూలు చేస్తాం. ఈ విషయంలో జీడిమెట్ల, బాలానగర్ ట్రాఫిక్ పోలీసులతో సమన్వయంతో ముందుకు వెళ్తాం. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలో జరగకుండా చర్యలు చేపడతాం.


శ్రీకాంత్, ఏఈడీ, బోయిన్‌పల్లి



నందానగర్‌కు వెళ్లే రోడ్డులో నిలిపిన ట్రక్‌లు



ట్రక్‌లు ఢీకొని ఒరిగిన స్తంభం



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె



సంజయ్‌గాంధీ నగర్ రోడ్డులో..



ఐడీపీఎల్‌ఐ-జగద్గిరిగుట్ట రోడ్డులో..

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బోనాలు నిలుస్తాయని బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ గ్రామంలోని మూడు గుళ్ల ఆలయంలో సోమవారం నిర్వహించిన బోనాల జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు కావడి చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు బల్వంత్ రెడ్డి పటేల్, సామల నర్సింహారెడ్డి, పెద్ది మల్లేశం, మురళీ గౌడ్ పాల్గొన్నారు.

☛ కుత్బుల్లాపూర్ డివిజన్ సుదర్శన్ రెడ్డినగర్‌లోని విరూపాక్ష, పోచమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీశ్, దేవాలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, ప్రణవ్ గౌడ్, బల్బిన్, సుదర్శన్‌రెడ్డి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబు గౌడ్, సభ్యులు సతీశ్‌గౌడ్, శ్రీనివాస్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

☛ ఉషోదయ కాలనీ ఫేస్–2 కాలనీ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ కమిటీ సభ్యులు చింతల్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ రామ్‌రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీరారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మాధవ రావు, జీవన్ బాబు, వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, సంయుక్త కార్యదర్శి వినోద్ కుమార్, శ్రీనివాస్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శి కామేశ్వర రావు, కల్యాణ కృష్ణన్ తదితరులు ఉన్నారు.

'చలో సచివాలయం' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మేడ్చల్ జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రకాంత్, బ్యాగరి వెంకటేశ్ అన్నారు. సూరారం ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ వద్ద విద్యార్థి సమస్యల పరిష్కారానికి ఈనెల 23న తలపెట్టిన చలో సెక్రటేరియేట్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రకాంత్, వెంకటేశ్ మాట్లాడుతూ..గత ప్రభుత్వం విద్యార్థి, ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకోవడంతోనే అధికారం కోల్పోయిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారన్నారు. అలాగే కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై 2 నెలలు పూర్తి కావస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు, పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందించలేదన్నారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ, ఫీజు నియంత్రణ చట్టం, విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ షార్ట్ ఫిల్మ్‌కు వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం



విశ్వగురు వరల్డ్ రికార్డ్ ధ్రువీకరణ పత్రంతో జాన్‌పాల్

నిజాంపేట్ : అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రానికి చెందిన ప్రముఖ నటుడు, రైటర్, ప్రొడ్యూసర్ జాన్‌పాల్ నిర్మించిన డొజో మూవీకి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఫౌండర్, సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు తెలిపారు. అర్మిన్ అలిక్ (యూఎస్ఏ) దర్శకత్వంలో జాన్‌పాల్ ప్రధాన పాత్రధారిగా నిర్మించిన లైవ్ యాక్షన్ ఫిక్షనల్ షార్ట్ ఫిల్మ్‌కు అంతర్జాతీయంగా 1200 ఫిల్మ్ అవార్డ్స్ సాధించింది. ఎక్కువ అవార్డ్స్ సాధించడంతో వరల్డ్ రికార్డ్ ఇచ్చామని తెలిపారు. ఈ ఫిల్మ్ ప్రొడ్యూసర్ జాన్‌పాల్ దరఖాస్తును విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ టీమ్ పరిశీలించి ఆన్‌లైన్ ద్వారా విశ్వగురు వరల్డ్ రికార్డ్ ధ్రువీకరణ పత్రాన్ని సోమవారం వారికి పంపించామని తెలిపారు.

ఎలక్ట్రికల్ వైర్ల చోరీ

కుత్బుల్లాపూర్: నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లోని ఎలక్ట్రికల్ వైర్లను ఎత్తుకెళ్లిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. పద్మనగర్ ఫేస్–2లో సదానంద్ అనే వ్యక్తి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నాడు. ఆదివారం సైట్‌లో పనిచేసే వాచ్‌మెన్ తన స్వగ్రామానికి వెళ్లగా, అదే రోజు రాత్రి 3 నుంచి 5 గంటల సమయంలో గుర్తుతెలియని దొంగలు కింద ఫ్లోర్‌లో ఉన్న ఎలక్ట్రికల్ వైర్ బాక్స్‌లు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం 9 గంటలకు అపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ బాబుగౌడ్ వెళ్లి చూడగా వైర్లు కనిపించలేదు. ఈ విషయాన్ని యజమానికి తెలిపి సీసీ ఫుటేజీ పరిశీలించగా అర్ధరాత్రి దొంగతనం జరిగిన సమయంలో 3–5 గంటల వరకు ఎలాంటి ఆధారాలు లేకుండా డిలీట్ చేశారని, ఈ విషయాన్ని అక్కడ సీసీ కెమెరా బిగించిన వ్యక్తి చెప్పడం విశేషం. పథకం ప్రకారం ప్రొఫెషనల్ దొంగలే ఈ చోరీకి పాల్పడినట్లు అనుమానించి పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాలతో ఇబ్బందుల్లేకుండా చర్యలు

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి



కలెక్టర్ మను చౌదరి, డిప్యూటీ కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి తదితరులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండేలా ఆదేశాలు ఇచ్చినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. రెవెన్యూ యంత్రాంగంతో సహా పురపాలక సంఘాల్లో కమిషనర్లు, సంబంధిత ఉద్యోగులు అప్రమత్తంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ సచివాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. మేడ్చల్ కలెక్టరేట్ నుంచి ఆయన మాట్లాడారు. చెరువులు, కుంటల సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాలు, కాలనీలు వర్షం కారణంగా వరద ముంపునకు గురికాకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.

నగరంలో 150 బృందాలు : సీఎం రేవంత్‌రెడ్డి

వర్షాలు కురుస్తున్న వేళ జిల్లా కలెక్టర్లు అప్రమత్తతో అన్ని విభాగాల అధికారులను సన్నద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆదేశించారు. గత 3 రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. నగరంలో 150 బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ సెంటర్లు, ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు.

ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి..

కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలతో ఖచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటనకు వెళ్లాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి రోజు కలెక్టర్లు తమ కార్యాచరణకు సంబంధించిన పూర్తి రిపోర్టును అందించాలని సీఎస్‌ను ఆదేశించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

రైతులకు కావాల్సినంత యూరియా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదులకు ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలన్నారు. శాసన సభ్యులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు రేషన్‌కార్డుల పంపిణీలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, సీపీఓ శేఖర్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ పాల్గొన్నారు.


జాతీయ హ్యాకథాన్‌లో విద్యార్థుల ప్రతిభ

సుభాష్‌నగర్: నేషనల్ లెవల్ క్వాంటనోవా–6 హ్యాకథాన్ పోటీల్లో దూలపల్లికి చెందిన సెయింట్ మార్టిన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 19 నుంచి 20 వ తేదీ ఉదయం 9.30 గంటల వరకు 24 గంటల పాటు సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో హ్యాకథాన్‌ను నిర్వహించగా 22 కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 224 మంది విద్యార్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఐదుగురు విద్యార్థులను విజేతలుగా ప్రకటించగా వారిలో ఇద్దరు సెయింట్ మార్టిన్స్ విద్యార్థులు ఉన్నారు. టెక్నీస్‌మ్యాన్ సంస్థ 9 మందికి ఇంటర్న్‌షిప్‌లు ప్రకటించగా వారిలో నాలుగు ఇంటర్న్‌షిప్‌లను సెయింట్ మార్టిన్స్ కళాశాల కైవసం చేసుకుంది. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్ రవీంద్ర, వివిధ విభాగాధిపతలు అభినందించారు.

'ఈఎంఆర్‌ఐ'లో ఉద్యోగావకాశాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లిలోని ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నాగేందర్ తెలిపారు. 1962, 102 వాహనాల పైలెట్ (డ్రైవర్) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, బ్యాడ్జ్ నెంబర్‌తో కూడిన లైసెన్స్‌లు ఉండి పదోతరగతి చదివి 35 ఏళ్ల లోపు ఉన్న వారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా బీఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీఏఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీఏఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తీగల శివకుమార్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక తెలంగాణ సాధించడమే లక్ష్యమని రానున్న స్థానిక ఎన్నికల్లో ఆజాద్ సమాజ్ పార్టీ పోటీ చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహంగీర్, షేక్ అమీర్ ఘెష్, ఎండీ మోయిన్, అయేషా సుల్తానా, ఫరిన్ బేగం, శోభన్ బాబు, గద్దం ప్రవీణ్, అరుణ్ పాల్గొన్నారు.

ఎదురుచూపు ఫలించేదెప్పుడు.?

- 3 నెలలుగా జీతాలు రాక.. సెలవులు లేక..
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్
- 20 ఏళ్ల నుంచి పని చేస్తున్నా.. రెగ్యులర్ కాలేదని ఆవేదన
- ప్రజా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖలో 24 ఏళ్ల నుంచి ఒకేషనల్ విభాగంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా పనిచేస్తున్న అధ్యాపకులు నెలనెలా వేతనాలు రాక.. అనారోగ్య సమస్యలు వచ్చినా.. సెలవులు దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లు తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

– సాక్షి,సిటీబ్యూరో



411 మంది ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్స్..

◆ తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 411 మంది ఒకేషనల్ కాంట్రాక్ట్ లెక్చరర్లకు శాంక్షన్ పోస్టులు లేవనే సాకుతో రెగ్యులర్ చేయలేదని వారు చెబుతున్నారు. జిల్లా పరిధిలోని 6 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 12 మందిని రెగ్యులర్ చేయలేదంటున్నారు. ఏప్రిల్ నుంచి 3 నెలల జీతాలు ఇప్పటి వరకు రాలేదని వాపోతున్నారు. 2000 సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులుగా ఒకేషనల్ విభాగంలో పనిచేస్తున్న సీనియర్లకు ఇంటర్ విద్యాధికారుల తప్పిదం వల్ల రెగ్యులర్ కాలేదన్నారు.

కమలనాథన్ కమిటీ లెక్కల ప్రకారం..

◆ కమలనాథన్ కమిటీ లెక్కల ప్రకారం తెలుగు రాష్ట్రాలు విడిపోయినప్పుడు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యకు 842 పోస్టులను అందించారు. కానీ ఇంటర్ విద్యాధికారులు గత ప్రభుత్వం చేపట్టిన రెగ్యులరైజేషన్ ప్రక్రియలో కేవలం 613 పోస్టులు మాత్రమే ఉన్నాయని, మిగతా ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయకుండా వదిలేశారని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అవసరమైన శాంక్షన్ పోస్టులు మంజూరుచేసి, కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలు అధికారంలోకి రాగానే విస్మరించడం దారుణమని, ఇప్పటికైనా న్యాయం చేయాలని ఒప్పంద అధ్యాపకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులర్ చేయాలి.



ప్రజా ప్రభుత్వం వెంటనే 411 పోస్టులను శాంక్షన్ చేసి ఒకేషనల్ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి. పదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని సుప్రీంకోర్టు వివిధ సందర్భాల్లో తీర్పును వెలువరించిందని, వాటి ఆధారంగా మాకు న్యాయం చేయాలి.

– రవిశంకర్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆరోగ్యం సరిగ్గా లేకున్నా.. సెలవులు ఇవ్వడం లేదు.



నెలనెలా జీతాలు ఇవ్వకపోవడంతో పాటు టైఫాయిడ్, డెంగీ వంటి జబ్బులు వచ్చినా వారం, 10 రోజులు ఆసుపత్రుల పాలైనా సెలవులు మంజూరు చేయడం లేదు. ఇంటర్ విద్యాధికారుల తప్పిదం వల్ల మాకు రెగ్యులరైజేషన్ కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలి.

– గౌతమ్, జీజేసీ, మేడ్చల్

ప్రతినెల జీతాలు చెల్లించాలి



3 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవటంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ప్రతినెల జీతాలు చెల్లించాలి. మమ్మల్ని రెగ్యులర్ చేయకపోవడంతో మహిళా అధ్యాపకులుగా పలు సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్నాం.

– హసీనా బేగం, జీజేసీ మల్కాజిగిరి

పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నాం



మాలో చాలా మంది కాంట్రాక్ట్ లెక్చరర్స్ రిటైర్మెంట్‌కు చేరువలో ఉన్నారు.రెగ్యులర్ చేయకపోవడం వల్ల తీవ్ర అన్యాయానికి గురికావాల్సి వస్తోంది. సమయానికి జీతాలు రాకపోవడంతో పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేకపోతున్నాం.

– వంశీకృష్ణ, జీజేసీ, మల్కాజిగిరి